తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ. జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
గురువారం
1 అక్టోబర్ 2026
పేజీలు - 12



# పాడే మోసిన సిరికొండ

**శాయంపేట ,సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** శాయంపేట మండలం, పెద్దకోడెపాక గ్రామంలో తెలంగాణ శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి తన చిరకాల సహచరుడు మంద రాజమల్లు పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.రాజమల్లు తో తనకున్న చిరకాల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో వారికి మనోధైర్యం కల్పించారు.అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొని, పాడె మోస్తూ తన ఆత్మీయ సహచరుడికి అంతిమ వీడ్కోలు పలికారు. రాజమల్లు మరణం వ్యక్తిగతంగా తనకు, ఆయన కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు.

## రిమ్స్ ఎస్ఎన్సియూ ఘటన అనంతరం శిశువుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

- డిశ్చార్జ్ అయిన శిశువులకు ప్రత్యేక ఫాలోఅప్
- రిమ్స్‌లో 34 పడకల ఎంఎన్ఐసియూ సేవలు అందుబాటులోకి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

వార్త మెయిన్ 7లో

# పుష్కరాలకు నిరంతర విద్యుత్ సరఫరా..

- అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి..
- సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి..
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో క్షేత్రస్థాయి పరిశీలన..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పుష్కరాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఏర్పాట్లను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా అధికారులు, సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పుష్కరాల సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సరస్వతి బ్యారేజీ నుంచి కాళేశ్వరం వరకు చేపడుతున్న 33 కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్ పనులను సీఎండీ పరిశీలించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు చేపడుతున్న ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టడంతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. తాడిచర్లలో కొత్తగా నిర్మిస్తున్న 132 కేవీ సబ్‌స్టేషన్ స్థలాన్ని సీఎండీ పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి వచ్చిన అనంతరం ఈ ప్రాంతంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా సామర్థ్యం మరింత బలోపేతం కానుందని తెలిపారు. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేసి, పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.



భవిష్యత్‌లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఇందులో భాగంగా గణపురం మండలంలోని గాంధీనగర్‌లో ప్రతిపాదిత నూతన సబ్‌స్టేషన్ల కోసం గుర్తించిన స్థలాలను సీఎండీ పరిశీలించారు. స్థలాల పరిస్థితి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నిర్మాణానికి అనుకూలత తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం భూపాలపల్లి పరిధిలోని మంజూర్‌నగర్ వద్ద ప్రతిపాదిత సబ్‌స్టేషన్ స్థలాన్ని కూడా పరిశీలించి, స్థలానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదిత సబ్‌స్టేషన్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు.

### సబ్‌స్టేషన్ నిర్వహణపై ఆరా..

భూపాలపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి సబ్‌స్టేషన్ నిర్వహణ, విద్యుత్ సరఫరా పరిస్థితులు, స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే సమయంలో తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని, ఎల్‌సీ (లైన్ క్లియర్) యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు.

అనుకోని పరిస్థితులు ఏర్పడినప్పుడు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని సీఎండీ సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఫీల్డ్ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి జాప్యం లేకుండా స్పందించాలని ఆదేశించారు.

### కవర్డ్ కండక్టర్ పనుల పరిశీలన..

విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు భూపాలపల్లి నుంచి నందిగామ వరకు చేపడుతున్న కవర్డ్ కండక్టర్ ఏర్పాటు పనుల పురోగతిని సీఎండీ పరిశీలించారు. పనుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను మిగతా 2లో..



# దివ్యాంగ విద్యార్థులకు విద్యా విహార యాత్ర

**హనుమకొండ ,అక్టోబర్ 1 ,(జనం సాక్షి ):** దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పరిశీలనా శక్తి, సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు అద్భుతమైన అభ్యసన అనుభవాలను అందించేందుకు వరంగల్ జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో సమ్మిళిత విద్యా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక విద్యా విహారాయాత్రను నిర్వహించారు.బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఈ విజ్ఞానవిహార యాత్రను వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వై విగణేష్ కలెక్టర్ కార్యాలయం ముందు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 70 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 20 మంది తల్లిదండ్రులు, 25 మంది ప్రత్యేక విద్యా బోధకులు, సమ్మిళిత విద్యా వనరుల వ్యక్తులు హైదరాబాద్ లోని జూ పార్కును సందర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు ఈ వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. వరంగల్ ఐఈడీ కోఆర్డినేటర్ డాక్టర్ కట్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో జూ పార్కులో వివిధ రకాల జంతువులు, పక్షులు, ప్రకృతి అందాలను ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు ఎంతో ఆనందోత్సాహంతో గడిపారు. పుస్తకాల్లో, చిత్రాల్లో చూసిన జంతువులను కళ్లారా చూడటంతో వారిలో ఆసక్తి, ఉత్సుకత పెరిగాయి. జంతువుల జీవన విధానం, ఆవాసాలు, ఆహారపు అలవాట్ల గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించింది. అనంతరం విద్యార్థులు భోజనం చేసి, సెక్రటేరియట్, ట్యాంక్ బండ్ సందర్శించారు ఆనందదాయకమైన అభ్యసన అనుభవాలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# జీవో నెం.3కు రాజ్యాంగబద్ధ ప్రత్యామ్నాయం తీసుకురావాలి

- తెలంగాణలో గిరిజనుల ఉపాధి హక్కులను పరిరక్షించాలి
- సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవి నాయక్



**బయ్యారం, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** ఏజెన్సీ, ప్రాంతాల్లో గిరిజన యువత ఉపాధి అవకాశాలను పరిరక్షించేందుకు జీవో నెం.3కు ప్రత్యామ్నాయ విధానాన్ని సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి రూపొందించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుదవారం సేవాలాల్ సేన, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2000 జనవరి 10న జారీ చేసిన జీవో నెం.3 ద్వారా ఏజెన్సి ప్రాంతాల్లోని పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులను స్థానిక షెడ్యూల్ తెగ అభ్యర్థులతో భర్తీ చేసే విధానం అమల్లోకి తీసుకొచ్చిందని అన్నారు. అయితే 2020 ఏప్రిల్ 22న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 100 శాతం రిజర్వేషన్‌ను రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ ఆ జి వో ను రద్దు చేసిందని తెలిపారు. జీవో నెం.3 రద్దు అనంతరం ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన యువత ఎదుర్కొంటున్న ఉపాధి అవకాశాల సమస్యను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి గిరిజనులకు ఉపాధి అవకాశాలు కలిగేలా చట్టపరమైన కొత్త విధానాన్ని రూపొందించాలని ఆయనకోరారు. గిరిజనుల విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. గిరిజనుల హక్కులు, ఉపాధి కాపాడే ప్రత్యామ్నాయ మార్గాన్ని రూపొందించడం ముఖ్యమన్నారు. గిరిజన సంఘాలు, న్యాయ నిపుణులు, సంబంధిత అధికారులతో ప్రభుత్వం విస్తృతంగా సంప్రదింపులు జరిపి తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో గిరిజన సంఘాల నాయకులు గొగ్గల కోటయ్య, తాటి వెంకటేశ్వర్లు, అజయ్ నాయక్, భూక్య శేఖర్ నాయక్, చింతల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాలకు నిరంతర విద్యుత్ సరఫరా..

తగ్గించడంతో పాటు సరఫరా నాణ్యతను మెరుగుపరిచేందుకు చేపడుతున్న కవర్డ్ కండక్టర్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని అధికారులకు స్పష్టం చేశారు.

**భీమ్‌ఘన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిశీలన..**

అనంతరం భీమ్‌ఘన్‌పూర్ 220/132 కేవీ సబ్‌స్టేషన్‌ను సీఎండీ పరిశీలించారు. సబ్‌స్టేషన్ నిర్వహణ, విద్యుత్ సరఫరా పరిస్థితులు, అక్కడి విద్యుత్ వ్యవస్థ పనితీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. భీమ్‌ఘన్‌పూర్ ప్రాంతంలో నీటిపారుదల అవసరాలకు సంబంధించిన విద్యుత్ సరఫరా అంశాలపై లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులతో సీఎండీ చర్చించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన అవసరాలు, భవిష్యత్ డిమాండ్, శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. నీటిపారుదల అవసరాలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేయాలి..**

విద్యుత్ మౌలిక వసతుల బలోపేతం, భద్రతా ప్రమాణాల అమలు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. భవిష్యత్‌లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని తెలిపారు. సబ్‌స్టేషన్ల నిర్మాణం, ఇంటర్‌లింకింగ్ లైన్లు, కవర్డ్ కండక్టర్ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎస్‌ఈ సదానందం, భూపాలపల్లి డీఈ పాపిరెడ్డి, టెక్నికల్ డీఈ జగదీశ్‌బాబు, సివిల్ ఈఈ వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

## దండు సోమయ్య కుటుంబానికి సీఐటీయూ ఆర్థిక చేయూత

**దేవరుప్పుల, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** ధర్మాపురం గ్రామపంచాయతీ సిబ్బంది దండు సోమయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబానికి దేవరుప్పుల మండలం సీఐటీయూ గ్రామపంచాయతీ యూనియన్ సభ్యులు అండగా నిలిచారు. కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.10,000 నగదును అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు సంగీ కర్ణాకర్, జనగామ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి బస్వ రామచందర్, జిల్లా కోశాధికారి బత్తిని వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, ప్రతాప్, ఎడెల్లి సోమయ్య పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 30 ( జనం సాక్షి):** తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని జల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన గీత కార్మికుడు అంబాల రవి కులవృత్తిలో భాగంగా బుధవారం సమీపంలోని తాటివనానికి వెళ్లి కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కుతున్నాడు. ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి చేయి విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటి గీతా కార్మికులు 108కి సమాచారం అందించగా 108 సిబ్బంది పైలెట్ వైనాల నాగరాజు, ఈఎంటి ప్రవీణ్ లు సంఘటన స్థలానికి చేరుకుని గీత కార్మికుడు అంబాల రవికి ప్రథమ చికిత్సను అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించినట్లు తెలిపారు.

## ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సభ్యుడిగా కాళేశ్వరం వాసి

కాళేశ్వరం , సెప్టెంబర్ 30 , ( జనం సాక్షి) ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా కాళేశ్వరం గ్రామానికి చెందిన ఆడప సమ్మయ్య మరోసారి ఎన్నికయ్యారు. 2026–2029 కాలానికి నిర్వహించిన ఎన్నికల్లో ఆయన మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా అవకాశం దక్కించుకున్నారు. గతంలో 2023–2026 కాలానికి కూడా మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగిన ఆడప సమ్మయ్య కు తాజాగా 2026–2029 కాలానికి రెండోసారి సభ్యుడిగా అవకాశం రావడం విశేషం. వరుసగా రెండోసారి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీలో సభ్యుడిగా ఎన్నిక కావడంపై కాళేశ్వరం గ్రామస్థులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తాం

**అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి...**



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి సభ్యులందరం కృషి చేస్తామని సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ 72వ వార్షిక సర్వసభ్య సమావేశం సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సంఘంలో స్వల్పకాలిక రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించిన రైతులకు 3 శాతం వడ్డీ తిరిగి వస్తుందన్నారు. రైతులందరూ సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అమీనాబాద్ లో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి చొరవతో యూనియన్ బ్యాంక్ వచ్చిందని అన్నారు. యూనియన్ బ్యాంక్ కి సంఘ లో ఉన్న రూములు లీజుకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పాలకవర్గం సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సిద్దన రమేష్, సర్పంచ్ దార రంజిత్, ఉప సర్పంచ్ బండి హరీష్, సహకార అధికారి నెక్కొండ సర్కిల్ సీనియర్ ఇన్స్పెక్టర్ దార విమల, డైరెక్టర్లు ఊరుగొండ లింగస్వామి, మంద యాకయ్య గౌడ్ బొంపల్లి ప్రసాద్, మంద సోమయ్య, అంబాల రవి, రాదారపు బిక్షపతి, పెంతల రమ, జోరు వీరయ్య, భూక్య నీల, పానుగంటి వీరమ్మ, దరావత్ భద్రు, రైతులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మానసిక వికాసమే సమాజ వికాసం

**సైకాలజిస్ట్ పోగు అశోక్**



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 30 ( జనం సాక్షి) :** నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దారుఢ్యాన్ని కలిగి ఉంటేనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ (టీ. పి. ఏ) అధ్యక్షుడు పోగు అశోక్ పేర్కొన్నారు. ఖిలా వరంగల్ మండలంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం "మానసిక ఆరోగ్యం – ఒత్తిడి నిర్వహణ" అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సు అత్యంత ఉత్సాహభరితంగా, స్ఫూర్తిదాయకంగా సాగింది.ఈ సందర్భంగా పోగు అశోక్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, మానసిక ఆరోగ్యం అనేది కేవలం మానసిక సమస్యలు లేకపోవడం మాత్రమే కాదని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసమని తెలిపారు.పరీక్షల భయం, చదువులో ఎదురయ్యే ఒత్తిడిని జయించి ప్రశాంతమైన మనస్సుతో లక్ష్యాల వైపు ఎలా సాగాలో విద్యార్థులకు ఆచరణాత్మక చిట్కాలను వివరించారు.నిరంతర సాధన, సరైన సమయపాలన ద్వారా ఏకాగ్రతను పెంచుకుని చదువులో అత్యుత్తమ ప్రతిభను కనబరచవచ్చని సూచించారు.మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించి, మానసిక వికాసానికి తోడ్పడే పుస్తక పఠనం, ఆటలు మరియు ధ్యానానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు బీజేపీ యత్నం

**పాలకుర్తిలో అడ్డుకున్న పోలీసులు**



పాలకుర్తి, సెప్టెంబరు 30 (జనంసాక్షి) హిందూ దేవుళ్లను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ ఆధ్వర్యంలో దహనం చేసేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీజేపీ మండల కమిటీ అధ్వర్యంలో నిరసనగా సీఎం రేవంత్రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు తీసుకురాగా. పోలీసులు అడ్డుకున్నారు. కొంత సేపు బీజేపీ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించినప్పటికి పోలీసులు ససేమిరా అంటూ దిష్టిబొమ్మను బలవంతంగా పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనం తరం బీజేపీ నాయకులను పోలీస్టేషన్ కు తరలించారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్, సుంకరనేని కోటేశ్వర్, పెనుగొండ సోమేశ్వర్, కడుదుల నిరంజన్రెడ్డి, సురేష్, పబ్బా సంతోష్, వెల్పుల దేవరాజ్, శ్రీనివాస చారి. తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ విద్యార్థినికి జాతీయస్థాయి కరాటే లో గోల్డ్ మెడల్



**తొర్రూరు సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** తొర్రూరు పట్టణం నందలి లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థిని ఎం ఎమ్.లాస్య శ్రీ ఇంటర్నేషనల్ కరాటా పోటీలలో బ్లాక్ బెల్ట్ను సాధించింది. సెప్టెంబర్ 27న బొంబాయిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే పోటీలలో అండర్ 14 విభాగంలో ఎమ్. లాస్య శ్రీ కి కుమిటీ విభాగంలో గోల్డ్ మెడల్ ను మరియు కటా విభాగంలో బ్రాంజ్ మెడల్ ను సాధించినందుకు గాను పాఠశాల కరస్పాండెంట్, పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ,ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి, లాస్య శ్రీ ని శాలువాతో సత్కరించి, ఐదువేల (5000/-)రూపాయల ప్రోత్సాహక నగదు ను అందజేసి, కరాటే మాస్టర్లు అయిన రాజకుమార్ మరియు శ్రీధర్ లను అభినందించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును విజయవంతం చేయాలి



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** వరంగల్–నల్గొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. హనుమకొండలోని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని ఓటరు నమోదు కార్యక్రమంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హత కలిగిన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని నాయకులకు సూచించారు. ప్రతి డివిజన్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించే విధంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి పట్టభద్రులకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ, అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు.పార్టీ నాయకులు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని, ప్రతి అర్హుడిని ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పట్టభద్రుల సమస్యలు, వారి హక్కులు, ప్రజాస్వామ్య ప్రక్రియలో వారి భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా విస్తృతంగా అవగాహన కల్పించాలని నాయకులు చర్చించారు.ఈ సమావేశంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్లు, మాజీ డివిజన్ ప్రెసిడెంట్లు,బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- డీఎల్ఎసి సమావేశం



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) : వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఆహార భద్రతపై జిల్లా స్థాయి సలహా కమిటీ (డీఎల్ఏసీ) సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు అందించే ఆహార నాణ్యత, పరిశుభ్రత, ఆహార భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వంటశాలలు, ఆహార పదార్థాల నిల్వ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించేలా పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పంపిణీలో తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. చిరు వీధి ఆహార వ్యాపారులకు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలపై తగిన శిక్షణ అందించి, ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత ప్రమాణాలపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఆహారం అందించే డైట్ క్యాంటీన్లలో తరచూ తనిఖీలు నిర్వహించాలని, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోగులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందేలా పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగించే తాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు నీటి నమూనాలను పరీక్షలకు పంపించాలని గ్రౌండ్ వాటర్ శాఖ అధికారిని ఆదేశించారు. తాగునీటి నాణ్యతపై క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజిరెడ్డి, ఏడీ ఫిషరీస్ శ్రీపతి,ఆహార పరిరక్షణ అధికారి సీహెచ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

- ఏసిపి సదయ్య



హనుమకొండ ,అక్టోబర్1,( జనం సాక్షి): సైబర్ నేరాలపై విద్యార్థులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఏసీపీ సదయ్య అన్నారు. హనుమకొండ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో అందరు భాగస్వామ్యం కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల మహిళల మీద జరిగే నేరాలను అదుపు చేయవచ్చని అన్నారు. అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్, స్నాప్ చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాల పై,అవగాహన కలిగివుండాలని, మహిళలు ఒంటరిగా తెలియని ప్రదేశాలకు ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు అందరు టీ-సేఫ్ ఆప్ ను ఉపయోగించుకోవాలని, టీ-సేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలని, ఉద్యోగాలు చేసే మహిళలకు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని సూచించారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి ఫిర్యాదు చేయాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ గారి వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కు ఫిర్యాదు చేసిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు.షీటీమ్ ఇన్స్పెక్టర్ సువర్ణ ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ బాడీ మీటింగ్ వాయిదా

నల్లబెల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరగవలసిన జనరల్ బాడీ మీటింగ్ వాయిదా పడినట్లు ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. ముందుగా నిర్ణయించిన తేదీ ప్రకారం నిర్వహించాల్సిన సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని పేర్కొన్నారు. మండల పరిషత్ పరిధిలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై సమావేశంలో చర్చించాల్సి ఉండగా, ప్రత్యేక అధికారి నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు సమావేశాన్ని వాయిదా వేసినట్లు అతను తెలిపారు. సమావేశం నిర్వహించే తదుపరి తేదీని త్వరలోనే తెలియజేస్తామని ఎంపీడీవో వెల్లడించారు.

# సింగరేణిలో సేవలు అభినందనీయం

**పదవీ విరమణ సేఫ్టీ ఆఫీసర్ కు జీఎం సన్మానం**



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): సింగరేణి సంస్థలో 39 ఏళ్ల బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ చేసిన సేవలు అభినందనీయమని భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. భూపాలపల్లి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ గా పదవీ విరమణ పొందుతున్న మాటూరి రవీందర్ కు బుధవారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ లో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జీఎం రాజేశ్వర్ రెడ్డి శాలువాతో సత్కరించి బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. రవీందర్ విధి నిర్వహణలో చూపిన అంకితభావం, క్రమశిక్షణ, సమన్వయం ప్రశంసనీయమని, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రామన్ పాఠక్, ఏసీఎంఓ డాక్టర్ పద్మజ, ఏజీఎం సివిల్ రవికుమార్, ఏజీఎం ఐఈడీ జ్యోతి, ఓసీ-2 పీఓ శ్యామ్ సుందర్, కేటీకే-1 గ్రూప్ ఏజెంట్ తిరుపతి, పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్, ఎన్విరాన్ మెంట్ ఆఫీసర్ పోషమల్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## పీఎం సూర్య ఘర్‌పై మూడు రోజుల అవగాహన శిబిరం



ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 30(జనంసాక్షి) : పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు ములుగు డివిజన్ కార్యాలయంలో సేవా సేతు అవగాహన శిబిరం నిర్వహించనున్నట్లు బి భిక్షపతి ఎస్ఈ ములుగు సర్కిల్ మరియు రాజేందర్ జిల్లా మేనేజర్, టీజీ రెడ్కో తెలిపారు. ఈ శిబిరంలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, విద్యుత్ బిల్లుల తగ్గింపు, నెట్ మీటరింగ్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో సోలార్ విక్రేతలు, బ్యాంకర్ల ప్రతినిధులు పాల్గొని రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు విధానం, బ్యాంకు రుణ సౌకర్యాలు, ఆర్థిక సహాయం మరియు పథకం అమలుకు సంబంధించిన అంశాలను వివరిస్తారు. అలాగే రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థపై ప్రత్యక్ష ప్రదర్శన, లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గృహ విద్యుత్ వినియోగదారులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, వెల్ఫేర్ అసోసియేషన్లు మరియు ఆసక్తి ఉన్న ప్రజలు ఈ మూడు రోజుల శిబిరానికి పెద్ద సంఖ్యలో హాజరై పీఎం సూర్య ఘర్ పథకం ప్రయోజనాలను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పాముకాటుకు బర్రె మృతి

నడి కూడ సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :నడికుడ మండలం వరికోల్ గ్రామంలో పాడి రైతు పోచపల్లి రాజిరెడ్డి ఇంటి వద్ద పశువుల కొట్టంలో కట్టేసిన బర్రెను పాము కాటు వేయడంతో మృతి చెందడం జరిగింది. సుమారు బర్రె విలువ 50 వేలు ఉంటుందని యజమాని తెలియజేశారు కుటుంబానికి జీవనోపాధి చూపించే బర్రె చనిపోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని కోరుతున్నారు.

# పరిశుభ్రత నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి

**మండల అభివృద్ధి అధికారి నిశాంత్**



మహా ముత్తారం సెప్టెంబర్ 30 (జనం సాక్షి) : గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామంలో పరిశుభ్రత నిర్వహణ వారి యొక్క బాధ్యత అని మండల అభివృద్ధి అధికారి నిశాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహా ముత్తారం గ్రామపంచాయతీ సిబ్బందికి యూనిఫాం దుస్తుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరియు కాటారం డివిజన్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొండగొర్ల బాపు, మండల అభివృద్ధి అధికారి నిశాంత్ పాల్గొని గ్రామపంచాయతీ సిబ్బందికి యూనిఫాం దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రాఫిక్స్ సర్పంచ్ కొండగొర్ల బాపు మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామాల పరిశుభ్రత, అభివృద్ధి మరియు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సిబ్బంది సేవలను గుర్తిస్తూ వారికి అవసరమైన ప్రోత్సాహం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. యూనిఫాం దుస్తుల పంపిణీ వల్ల సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెరిగి, మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించేందుకు తోడ్పడు తుందని తెలిపారు. ఎంపీడీవో నిశాంత్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది నిరంతరం ప్రజలకు సేవలందిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. సిబ్బంది సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.యూనిఫాం దుస్తులు అందుకున్న గ్రామపంచాయతీ సిబ్బంది కొండగొర్ల బాపు, ఎంపీడీవో నిశాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పులిసే సుమలత, రాజు, సాగులం అనసూయ, బంధం బసవయ్య, జంగిడి కీర్తన, పంచాయతీ కార్యదర్శి, శ్రీకాంత్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## విమానాశ్రయానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి



జయశంకర్ భూపాల పల్లి బ్యూరో, (జనంసాక్షి): వరంగల్ మామునూరు విమా నాశ్రయానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బహుజన వీరుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, తెలంగాణ పౌరుషాన్ని నలుమూలల చాటి చెప్పిన బహుజన వీరుడు గౌడ జాతికే కాకుండా అన్ని వర్గాలను పోరాట చైతన్యంతో తీర్చిదిద్ది గోల్కొండ కోటను కైవసం చేసుకున్న ధైర్యశాలి అని చెప్పారు. ఓరుగల్లు పక్కన ఉన్న ఖైలాసపూర్ పుట్టిన అతని స్వగ్రామం ఉమ్మడి వరంగల్ జిల్లా కావున సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విమానాశ్రయంగా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి

మంగపేట, సెప్టెంబర్ 30(జనంసాక్షి) : వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదును పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ తోట రవీందర్ తెలిపారు. 01.11.2023 నాటికి డిగ్రీ లేదా తత్సమాన కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులు అని ఆయన స్పష్టం చేశారు. అలాగే అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం -- 18 ద్వారా తమ దరఖాస్తులను తప్పనిసరిగా సమర్పించాలి అని ఆయన తెలిపారు. దరఖాస్తు ప్రక్రియలో దరఖాస్తుదారులు రెండు సరికొత్త పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, డిగ్రీ లేదా డిప్లొమా ఒరిజినల్ సర్టిఫికెట్, మెమో జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డ్,,ఓటరు గుర్తింపు కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆయన తెలిపారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి : ఎంపీడీవో

పాలకుర్తి, సెప్టెంబరు 30 (జనంసాక్షి): ఎల్ నినో ప్రభావంతో ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీవో వర్కల వేదవతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వీబీజీరాంజీ పథకంపై సర్పంచు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ప్రజలకు తాగు నీటి కష్టాలు రాకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు పనులు కల్పించేందుకు నీటి కుంటలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

# పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

మావల అక్టోబర్ 01 ( జనం సాక్షి):పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి కొనుగోళ్ల సన్నద్ధత, ఏర్పాట్లు, ఇతర అంశాలు, ప్రణాళికలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నాణ్యత లేని పత్తి మార్కెట్కు రాకుండా చూడటమే ఏఈఓల తొలి ప్రాథమిక బాధ్యత అని, తేమ శాతం, మాయిశ్చరైజర్ వివరాలపై ప్రతి ఏఈఓ, ఏవో పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెల్పిచెప్పారు. మొదటి రోజు నుంచే ఏఈఓలు బ్రాంచ్ మేనేజర్ సీసీఐతో సమన్వయం చేసుకుంటూ, ఏ క్లస్టర్ నుంచి ఎంత నాణ్యమైన, ఎంత నాణ్యత లేని పత్తి వస్తుందనే సమాచారాన్ని క్షుణ్ణంగా సేకరించాలని సూచించారు. పత్తి కొనుగోళ్లు, ఎఫ్ఏక్యూపై పోస్టర్లు, ఫ్యాంప్లెట్లు తయారు చేసి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ప్రతి పత్తి కొనుగోలు కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన ధర్మబాద్, కిన్వట్ నుండి వచ్చే పత్తి



నిల్వలపై ప్రత్యేక నిఘా ఉంచి, జిన్నింగ్ మిల్లుల వద్ద లోకల్ మానిటరింగ్ కమిటీలతో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. కౌలు రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను గ్రామ స్థాయిలో ఏవో, పంచాయతీ కార్యదర్శులు పక్కాగా నిర్వహించాలని, ప్రతి లావాదేవీలోనూ ఆధార్ అనుసంధానం, ఓటీపీ తప్పనిసరి అని అన్నారు. రైతు రిజిస్ట్రీ ఐడీ ఆధారంగానే స్లాట్ బుకింగ్ ప్రక్రియ జరుగుతుందని, జిల్లాలో రైతుల భూముల వివరాలు, సాగు విస్తీర్ణం ఆధారంగా అర్హతలను నిర్ధారించి స్లాట్లు కేటాయించాలని తెలిపారు. ఒక రైతు ఒక రోజులో గరిష్ఠంగా 100 క్వింటాళ్ల వరకు స్లాట్ బుక్ చేసుకోవచ్చని, మొత్తం అర్హత పరిమితిలో (ఉదాహరణకు 120 క్వింటాళ్లు ఉంటే) మిగిలిన పరిమితిని తదుపరి రోజుల్లో బుక్ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. బహిరంగ మార్కెట్లో ప్రైవేట్ వ్యాపారులు ఇచ్చే ధరల కంటే మద్దతు ధర (మీడ్రా – క్వింటాలుకు రూ. 8,667) అధికంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి మోసపోకుండా ఏఈఓలు, వ్యవసాయ అధికారులు చైతన్యవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గతంలో స్లాట్ గడువు 7 రోజులు మాత్రమే ఉండగా, ఈసారి దానిని 14 రోజులకు పెంచడం జరిగిందని, దీనివల్ల రైతులు తమ సౌలభ్యం మేరకు పత్తిని విక్రయించుకోవడానికి తగినంత వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, తదితర ఏజెన్సీ మండలాల్లో ప్రైవేట్ ట్రేడర్లు మార్కెట్ ధర కంటే తక్కువకు కొనుగోలు చేయకుండా అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్, మార్క్ఫెడ్ డీఎం మహేశ్ కుమార్, టెక్నికల్ ఏవో విశ్వామిత్ర, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సిసిఐ ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలి

**● అడిషనల్ కలెక్టర్ రాథోడ్ రమేష్**



సారంగాపూర్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) : భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాథోడ్ రమేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం సారంగాపూర్ మండలంలోని కొట్ల బి రెవిన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను గ్రామ సర్పంచ్ తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానం, హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న రీ-సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి, వాటిని సంబంధిత భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో లక్ష్మీ కాంతారావు, డిప్యూటీ తాసిల్దార్ రాజేందర్, ఆర్ ఐ వెంకట్ నరసయ్య, జి పి ఓ రజిత, ఎం సి యోహాన్,సర్పంచ్ బల్గూరి అజయ్, ఉప సర్పంచ్ ఇప్ప శ్రీకాంత్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

సారంగాపూర్, సెప్టెంబర్ 30:(జనం సాక్షి) సారంగాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నిర్మల్ శ్రీ రమేష్ రాథోడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో జరుగుతున్న పనులను సమీక్షించారు. సార్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, భూభారతి ఫైళ్ళు, ప్రజావాణి ఫైల్స్, పెండింగ్లో లేకుండా మీసేవ సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కాంత్ రావు, ఎంపీడీవో లక్ష్మీకాంత్, నాయబ్ తహసీల్దార్ రాంచందర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సి సెల్ అధ్యక్షుల నియామకం

బెల్లంపల్లి, సెప్టెం బర్ 30, (జనంసాక్షి) : బెల్లంపల్లి నియోజక వర్గంలోని అన్ని మండ లాల, పట్టణాల ఎస్సి సెల్ అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ ప్రకటించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. బెల్లంపల్లి పట్టణం శంశీర్ నగర్ కు చెందిన కంబాల రాజేష్, బెల్లంపల్లి రూరల్ గురిజాలకు చెందిన సురేష్, కాసిపేట మండలం కాసిపేటకు చెందిన నస్పూరి నర్సింగం, తాండూర్ మండలం మాదారంకు చెందిన కొండగొర్ల అంజి, కన్నెపల్లి మండలం మెట్ పల్లికి చెందిన దుగుట చంద్రయ్య, వేమనపల్లి మండలం క్యాతనపల్లికి చెందిన దొబ్బల పోశం, నెన్నెల మండలం జెండా వెంకటాపూర్ కు చెందిన బోర్లకుంట వెంకటేష్, బీమిని మండలం పెద్దపేటకు చెందిన దాగామ వెంకటేష్ ను నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్**



మావల అక్టోబర్ 01:( జనం సాక్షి): శాంతి భద్రతల పరిరక్షణ దృశ్య, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణం భంగం కాకుండా, సవ్యంగా కొనసాగించడానికి అక్టోబర్ ఒకటి నుండి 31 వ తారీకు వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ - 1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని మరియు సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. అదేవిధంగా రానున్న దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని సూచించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## బాసర మండల అభివృద్ధిపై ఫోకస్

బాసర, సెప్టెంబర్ 31(జనం సాక్షి) : బాసర మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం అక్టోబర్ 1వ తేదీ (బుధవారం) ఉదయం 10 గంటలకు ఎంపీపీ హాల్ లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దేవేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధికి సంబంధించిన 19 కీలక అంశాలపై చర్చించను న్నారు.గత సమావేశపు తీర్మానాల అమలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు ప్రగతి, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై క్షుణ్ణంగా సమీక్షించనున్నట్లు సమాచారం. అన్ని శాఖల అధికారులు తమ శాఖల వారీగా నివేదికలు, ప్రగతి వివరాలతో సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ ఆదేశించారు.ఈ సమావేశానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల మండల అధికారులు హాజరుకానున్నారు.

## జోనల్ స్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక.



బెల్లంపల్లి, సెప్టెంబర్ 30, (జనంసాక్షి) : బెల్లంపల్లిలోని తెలంగాణ జనరల్ గురుకుల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ -14, 17 ఖోఖో పోటీల్లో తెలంగాణ సాంఘీక సంక్షేమ కాసిపేట గురుకుల తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఆర్ వాల్ సింగ్, కె మహిక్షిత్ , జి అక్షయ్ జోనల్ స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పూటూరి సంతోష్ కుమార్ తెలిపారు.

## ఆహారంలో వినియోగించే కల్తీ వస్తువులను నివారించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30(జనంసాక్షి ): జిల్లాలోని హోటళ్ళు, బేకరీలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలలో తయారుచేసే ఆహారంలో కల్తీ వస్తువులను వినియోగించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి హాజరై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్ళు, బేకరీలు, తినుబండారాల షాపులను ఆహార భద్రత అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, కల్తీ వస్తువులను ఆహారంలో వినియోగించకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యాపారాల అనుమతులు, షాపుల రిజిస్ట్రేషన్లు తనిఖీ చేయాలని, కల్తీ వస్తువులను వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలలో ఆహారం తయారీలో వినియోగించే ముడి పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు, విష బాధ ఘటనలను నివారించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. తనిఖీల సమయంలో లభించిన వస్తువులు, ఆయా వ్యాపార సంస్థల వివరాలు పత్రికలలో వచ్చే విధంగా ఫుడ్ ఇన్స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ అధికారి వాసు రావు, ఫుడ్ ఇన్స్పెక్టర్ మహేందర్, వైద్యులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు కుమ్ర పుల్లారావుకు ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు సభ

జైనూర్, సెప్టెంబర్ 30(జనం సాక్షి) : మండలం లచ్చు గూడ గ్రామంలో టీ,డబ్ల్యు, పిఎస్ పాఠశాలలో ఎస్జీటీ.గా విధులు నిర్వహిస్తున్న కుమ్ర,పుల్లారావు సుదీర్ఘ సేవా కాలం అనంతరం 30న పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు. కుమ్ర పుల్లారావు, దంపతులను పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. తన ఉద్యోగ ప్రస్థానంలో సహకరించిన తోటి ఉపాధ్యాయులకు, అధికారులకు, గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.